ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 33.0

కనిష్ఠం : 27.0



..అనే నేను!



బడేటి చంటి

రోషన్ కుమార్

శాసనసభలో నేడు ఎమ్మెల్యేల పదవీ ప్రమాణ స్వీకారం

- ఆ వెంటనే అందరికి అధికారాలు వర్తింపు
- అన్నిచోట్లా ప్రొటోకాల్ అమలు చేయాల్సిందే
- ఇక యంత్రాంగం కూడా ఎమ్మెల్యేల పరిధిలోనే..
- నూతన ఎమ్మెల్యేల ఎదుట పెనుసవాళ్లు
- సగానికి సగం నియోజకవర్గాల్లో ఆచీతూచీ అడుగు వేయాల్సిందే
- ఆల్ ది బెస్ట్ చెప్పిన నేతలు, కార్యకర్తలు



చిర్రి బాలరాజు | పత్సమట్ల ధర్మరాజు | చింతమనేని ప్రభాకర్ | కొలుసు పార్థసారథి | కామినేని శ్రీనివాస్

సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని ఘన విజయం సాధించి ప్రజా మన్ననలు పొంది భారీ మెజార్టీతో గెలుపొందిన కూటమి పక్షాన అభ్యర్థులంతా నేడు శాసన సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయ నున్నారు. ఇంతకు ముందే ముఖ్య మంత్రిగా చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయగా, ఇప్పుడు శాసన సభలో కూటమి స్పీకర్ వీరిచేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికి గాను ఇప్పటికే అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఏలూరు జిల్లా పరిధిలోని నలుగురు టీడీపీ పక్షాన గెలుపొందగా, ఇద్దరు జనసేన, మరొకరు బీజేపీ పక్షాన గెలుపొందారు. వీరంతా అఖండ మెజార్టీలతోనే ప్రత్యర్థులను చిత్తుచేశారు.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

శాసనసభ్యులుగా నేడు ప్రమాణం చేయనున్న వారి ఎదుట పెనుసవాళ్లే ఉన్నాయి. జరిగిన అరాచకాలు, అవినీతి, డొంకతిరుగుడు, దారి మళ్లింపు, గండికొట్టిన, నిలిచిన పథకాలు ఇలా ఎన్నో ఉన్నాయి. కూటమి ఎమ్మెల్యేలు తమకు సంతృప్తికరంగా సేవ చేయగలుగుతారన్న నమ్మకంతోనే ప్రజలంతా ఉన్నారు. వీరి ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చెమటో డ్చాల్సి ఉంది. మంత్రులుగా సమర్థులనే మంత్రివర్గంలోకి తీసుకోవడం వారి స్థాయికి తగినట్లుగానే శాఖలు కేటాయించారు. ఇప్పుడు ఎటు తిరిగి శాఖల ప్రక్షాళనకు మంత్రులు నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను ఈ ఐదేళ్లల్లో అధికమించడంతో పాటు ప్రజలు మెచ్చేవిధంగా పాలన చేయాల్సి ఉంది.

సవాళ్లను అధికమించేలా పారదర్శకత

ప్రత్యేకంగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్న శాసన సభ్యులు అందరికి ఆయా నియోజక వర్గాల్లో సమస్యలు పరిష్కరించడంలో, కేడర్‌ను ఆదుకోవడంలో ఖచ్చితంగా వ్యవహరించడమే కాకుండా పారదర్శకంగా నడక ఆరంభించాల్సిందే. ఎందుకనంటే తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఈ మూడు పార్టీలు కూటమిలో ఉన్నందున అంతకు మించి ఎన్డీయే పక్షాన నిలిచినందున ఆయా నియోజక వర్గాలన్నింటిలో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిచినా కూటమిలోని భాగస్వామ్య పక్షాలను గౌరవించాల్సి ఉంది. ఎక్కడా ఏకపక్ష నిర్ణయాలకు, దూకుడుకు ఆస్కారం లేని విధంగా అంతకంటే మించి కక్ష సాధింపునకు అసలు అవకాశం లేకుండా పాలన సాగించాల్సిందిగా నూతన ఎమ్మెల్యేలకు కూటమి పక్షాన సంకేతాలు అందాయి. తగ్గట్లుగానే బేషజం లేకుండా పాలన చేయడం సమయానుకూలంగా స్పందించడం ప్రజలు కష్టంలో ఉన్నప్పుడు క్షేత్ర స్థాయిలో వాలిపోయి అండగా నిలువడం, అధికారులను ఆ దిశగా పరుగులు పెట్టించడం, బాధితులకు అవసరమైతే సాయం అందేలా చర్యలకు దిగడంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఫెయిల్ అయ్యారు. ఇలాంటి వాటి నుంచి కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు అప్రమత్తం కావాల్సి ఉంది. టిడ్కో ఇళ్లు తెలుగుదేశం హయాంలోనే నిర్మించారు. లబ్ధి దారుల ఎంపిక ఆనాడే జరిగింది. మూడు దశలుగా ఇళ్లను విభజించి ఆ మేరకు కొంత సొమ్మును డిపాజిట్ చేయించారు. కాని చివరికి వచ్చేసరికి వీరిలో అనేకమందిని వైసీపీ ప్రభు త్వం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించింది. వీరిలో కొంద రికి జగనన్న కాలనీల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చి తమదారికి తెచ్చుకునే ప్రయత్నం చేసింది. ఇళ్ల నిర్మాణంలో కావాల్సిన వారికే తొలుత ప్రయార్టీ ఇచ్చి మిగిలిన వారిని పక్కన పెట్టింది. ఇలాంటి పరిణామాలన్నింటిని కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు పెద్దసవాల్‌గానే ఉన్నాయి. గడిచిన ఏడేళ్ల క్రితం లబ్ధిదారుల ఎంపిక, టిడ్కో ఇళ్ల నిర్మాణం జరిగిన వేళ ఉన్న పరిస్థితులు, ఇప్పుడు మారిన పరిస్థితులను బేరీజు వేసుకుని స్పందించాల్సి ఉంది. దీనికంటే మించి వైసీపీ అరాచకాలను కట్టడి చేయాలి. నియోజక వర్గాల్లో వైసీపీ చేసిన అరాచకాలకు విరుగుడుగా తాము కూడా బదులు తీర్చుకోవాల్సిందేనని ఇప్పటికే కూటమిలోని అనేకమంది నేతలు, కార్యకర్తలు తీవ్రంగా భావావేశంలో ఉన్నారు. ఇప్పటికే గెలిచిన ఎమ్మెల్యేలతో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఈ పరిస్థితిని అధికమించేందుకు కిందిస్థాయిలో కేడర్‌ను శాంతింపచేయడం కూటమి ఎమ్మె ల్యేలకు మరో అగ్నిపరీక్ష. ప్రతీకారేచ్చతో దెబ్బకు దెబ్బ అన్నట్లుగా బదులు తీర్చు కోవాలా? లేదా గాంధీ మార్గం లో వ్యవహరించాలనేది తేల్చుకోవాల్సి ఉంది. ఐదేళ్ల పాటు కేసుల్లో ఇరుక్కుని కోర్టులు చుట్టూ తిరుగుతున్న వారంతా ఇప్పటికే రగిలిపోతున్నారు. ఏలూరు జిల్లా అంతటా ఈ తరహా కేసుల సంఖ్య వందల్లోనే ఉంది. కాని ఏ పరిస్థితుల్లోనూ ప్రతీకారేచ్ఛకు అవకాశం లేదని శాంతియుతంగానే తామంతా ప్రజలతో కలిసి మెలిసి వెళతామని కూటమిపక్ష నేతలు చెబుతున్నా రు. దెందులూరు వంటి నియోజకవర్గంలో ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రభాకర్, ఆయన అనుచరుల మీద గడిచిన ఐదేళ్లల్లో పోలీసులతో పాటు స్థానిక వైసీపీ నేతలు ఎడాపెడా కేసులు బనాయించారు. దాడులకు దిగారు. ఆస్పత్రుల పాలైన కార్యకర్తలను కాపాడుకోవడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. కైకలూరు, నూజివీడు, ఉంగుటూరు నియోజక వర్గాల్లోనూ ఇదే సీను. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యేలంతా తమ నియోజక వర్గాల్లో సమయమనంతో సంక్షేమం, అభివృద్ధి పేరిట ముందడుగు వేస్తారని అందరూ భావిస్తున్నారు.

ఆల్ ది బెస్ట్..

శాసనసభ్యులుగా నేడు పదవీ ప్రమాణం చేయనున్న ఎమ్మె ల్యేలు అందరికి కూటమి పక్షాన నేతలు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎందుకనంటే అధికారికంగా రేపటినుంచే ఎమ్మెల్యేలంతా తమ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. తదానుగుణంగానే వీరందరికి ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్నింటిని సమకూర్చబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన అనేక పథకాలను వీరు తమ నియోజకవర్గాల్లో పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఈ నెలా ఖరు నాటికే కొంతలో కొంత పాలనా యంత్రాంగం ఒక గాడిన పడే అవకాశం ఉన్నందున అధికారుల సమీక్షలకు కీలక నిర్ణయాలకు అవకాశం ఉండబోతోంది. నామినేటెడ్ పదవుల విషయం లోనూ వివిధ సిఫార్సులు అందుబాటులోకి వస్తాయి. నేడు ప్రమాణం చేయనున్న శాసనసభ్యుల పక్షాన ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నేతలు సంబరాలు చేస్తూనే ఉన్నారు.

జిల్లాకు కలిసొచ్చిన అదృష్టం

జిల్లాలో అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టుతో పాటు చింతలపూడి ఎత్తిపోతల వంటి పథకాలు ఉన్నాయి. వీటిమీదే రైతులు, సామాన్యుల దృష్టి లేకపోలేదు. పొరుగున అమరావతి రాజధాని నిర్మాణం, ఇటు పోలవరం నిర్మాణం సమాంతరంగా సాగితే తమకు ఇంకా తిరుగులేదనే దిశలో కూటమి కార్యకర్తలు ఉన్నారు. జిల్లాలో నూజివీడు నుంచి గెలిచిన కొలుసు పార్థసారథికి గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాలశాఖ, బాధ్యతలు అప్పగించారు. గృహ నిర్మాణంలో ఏలూరు జిల్లాలో చాలా వెనుకబాటు తనమే ఉంది. రాష్ట్రంలో మోడల్ కాలనీగా కైకలూరులో జగనన్నకాలనీని తీర్చిదిద్దారు. ఏలూరులో సామాన్యులకు అత్యధికంగా 37వేల మందికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇంకోవైపు నూజివీడు, ఏలూరు, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతా ల్లో టిడ్కో ఇళ్లు ఉన్నాయి. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే హౌసింగ్ కూడా ఈ జిల్లాకు అత్యంత కీలకంగానే ఉండబోతోంది. ఇదే జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారథి ఇక్కడే ఉండటంతో కొంతో కొంత సమస్యతీరే అవకాశం కనిపిస్తోంది. మిగతా ఎమ్మెల్యేలకు ఇదొక కలిసివచ్చే అంశమే. అయితే చాలా విభాగాలు ఇప్పటికే వెనుకబడ్డాయి. గోతులు తిన్న రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన బాధ్యత, ఎమ్మెల్యేల మీదే ఉంది. కాల్వల మరమ్మతులు, పిల్ల కాల్వల నిర్మాణం, తాగునీటి పథకాల అమలు, నిలిచిన భవనాలు, రోడ్డున పడిన అనేక కుటుంబాలకు ఎమ్మెల్యేలు పెద్ద దిక్కు. జనసేన పక్షాన పోలవరం నుంచి చిర్రి బాలరాజు, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ పక్షాన కైకలూరు నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్, తెలుగుదేశం పక్షాన దెందులూరు నుంచి చింతమనేని ప్రభాకర్, చింతలపూడి నుంచి రోషన్ కుమార్, ఏలూరు నుంచి బడేటి చంటి, నూజివీడు నుంచి కొలుసు పార్థసారథి నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరిలో అత్యధిక సవాళ్లు కొల్లేరు ప్రాంతంలో ఉన్న కైకలూరు, ఉంగుటూరుతో పాటు దెందులూరు నియోజక వర్గానికి కూడా ఈ సెగ తాకనుంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, భారీ ఎత్తున తరలివెళ్లాలని భావించినా శాసనసభ ప్రాంగణం లో ఉన్న చోటు పరిమితంగా ఉండటంతో ప్రస్తుతానికి వీరికి ఆ అవకాశం లేకుండా పోయింది.

ప్రమాదభరితంగా ప్రాజెక్టు రోడ్డు



కోతకు గురైన ప్రాజెక్టుకు వెళ్ళే రోడ్డు మార్గం

పోలవరం, జూన్ 20 : నిత్యం వందలాది వాహనాలు పోలవరం ప్రాజెక్టుకి రాకపోకలు సాగించే రోడ్డు మార్గం ప్రమాద స్థాయిలో కోతకు గురి కావడంతో వాహనాలు స్పిల్ ఛానల్‌లోకి పడిపోయే పరిస్థితులు నెల కొన్నాయి. పోలవరం ప్రాజెక్టు కార్యాలయాల నుంచి దిగువకు వచ్చే మార్గంలో స్పిల్‌వేను ఆనుకుని కొండపక్క నుంచి రోడ్డు మార్గం వెళ్తుంది. గత వరదల తాకిడికి రోడ్డు మార్గం కింద నుంచి కోతకు గురై మట్టి స్పిల్ ఛానల్‌లోకి అండలుగా పడిపోయి ప్రమాదకర స్థాయిలో కోతకు గురైంది. ఆ ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక గొట్టాలు సైతం కిందకి పడిపోవడంతో ప్రమాద సూచిక కాన రాకుండా పోయింది. వాహనాలు ఒకదానికొకటి ఎదురైన సందర్భంలో తప్పుకోవడానికి పక్కకి వెళితే స్పిల్ ఛానల్‌లోకి వాహనాలు పడిపోయే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోకపోతే రానున్న వరదల సీజన్‌కు మరింత కోతకు గురై రోడ్డు మార్గం పూర్తి స్థాయిలో కోతకు గురై పోలవరం ప్రాజెక్టుకి రాకపోకలు బంద్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

వేగవంతంగా కేసుల దర్యాప్తు : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 20 : పోలీస్ స్టేషన్లలో నమోదు చేసిన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా నేరసమీక్షా సమావేశం గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని, మద్యం అక్రమ రవాణా జరగకుండా, సారా తయారు చేయకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బ్లాక్‌స్పాట్స్ వద్ద తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనుమానాస్పద మృతి కేసులు, మిస్సింగ్ కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాల న్నారు. కోడిపందేలు, పేకాట నిర్వహించేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ స్వరూపరాణి, ఏఆర్ ఏఎస్పీ శేఖర్, డీటీసీ ఎస్పీ ప్రభాకరరావు, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజీవీడు డీఎస్పీలు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు పక్కదారి!

- గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు
- పేద రైతుల పేరు చెప్పి పక్కదారి పట్టించిన వైసీపీ నాయకులు
- గుట్టురట్టుకు ఎమ్మెల్యే చింతమనేని ఆదేశం
- రంగంలోకి అధికారులు.. కసరత్తు ప్రారంభం



పెదవేగి ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఉంచిన ట్రాక్టర్లు



పెదపాడు సొసైటీ వద్ద నిలిపి వుంచిన ట్రాక్టర్లు

పెదవేగి/పెదపాడు, జూన్ 20 : పేద రైతులకు యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పథకం పక్కదారి పట్టింది. పేదలకు అందించాల్సిన యంత్రాలను వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీకి చెందిన బడా నాయకులే సొంతం చేసుకున్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వంలో కదలిక వచ్చింది. నిబంధనలు పాటించకుండా సొంతంగా వాడుకుం టున్న ట్రాక్టర్లపై విచారణ చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు దారి తప్పిన యంత్రాలను తిరిగి వెనక్కి రప్పించి, తదుపరి చర్యలు తీసుకునే దిశగా కసరత్తు ప్రారంభించారు. గురువారం సాయంత్రానికి 28 ట్రాక్టర్లలో 25 ట్రాక్టర్లను సంబంధిత లబ్ధిదారులు పెదవేగి మండల పరిషత్ కార్యాలయం దగ్గరకు తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

పేద రైతుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గత వైసీపీ ప్రభుత్వం రాయితీపై ట్రాక్టర్ల పంపిణీ చేపట్టింది. ఈ ట్రాక్టర్లను తీసుకోవాలంటే ఐదుగురు పేద రైతులు గ్రూపును ఏర్పాటు చేసి ట్రాక్టర్‌ను పొందాల్సి ఉంటుంది. పెదవేగి మండలంలో మొత్తం 28 ట్రాక్టర్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా, 40 శాతం రాయితీతో ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరు చేసింది. ట్రాక్టర్, ఇతర వ్యవసాయ అనుబంధ యంత్ర పరికరాలు ఈ యూనిట్‌లో ఉన్నాయి. ఈ ట్రాక్టర్లను తీసుకోవాలంటే ఐదుగురు సభ్యులతో గ్రూపును ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ఇతర నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. అంతేకాక తీసుకున్న ట్రాక్టర్లను సంబంధిత గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల దగ్గర ఉంచి ప్రభుత్వం సూచించిన ధరల ప్రకారం ఇతర రైతులకు వ్యవసాయ అవసరాలను తీర్చాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఇలా జరగలేదు. గ్రూపులను అయితే ఏర్పాటు చేశారు కానీ ఆ గ్రూపులో ఉన్న సభ్యులను నామ్‌కే వాస్తేగా పథకాన్ని పొందడానికి మాత్రమే తీసుకున్నారే తప్ప గ్రూపులో ఉన్న సభ్యులకు ఏ మాత్రం సంబంధం లేదనే విషయం బయట పడింది. రాయితీపై ట్రాక్టర్ ఇస్తారనే విషయాన్ని గ్రూపు సభ్యులకు చెప్పకుండా గుట్టుగా ట్రాక్టర్లను కొట్టేశారు. పెదవేగి మండలంలో ఈ నిబంధనలను ఎక్కడా పాటించకుండా మొత్తం 28 ట్రాక్టర్లను వైసీపీ నాయకులే సొంతం చేసుకున్నారు. దీనిపై అందిన ఫిర్యాదుతో మొత్తం వ్యవహారాన్ని బయటకు తీయాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే చింతమనేని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. దీంతో కదిలిన యంత్రాంగం గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న 28 ట్రాక్టర్లను తీసుకు రావాల్సిందిగా చెప్పడంతో గురువారం సాయంత్రానికి 25 ట్రాక్టర్లను తీసుకొచ్చి మండల పరిషత్ కార్యాలయంలో ఉంచారు. మరో మూడు ట్రాక్టర్లు మాత్రం రావాల్సి ఉంది. అయితే ట్రాక్టర్లు తీసుకున్న వారిలో చాలామంది రాయితీగా వచ్చిన సొమ్మును జమ చేసి, రుణం చాలావరకు తీర్చేశారని తెలిసింది. నిజానికి రాయితీతో కూడిన రుణంతో పొందిన ట్రాక్టర్ రుణాన్ని వాయిదాల పద్ధతిలో నిర్ణీత గడువు వరకు చెల్లించాల్సి ఉంటుంది. చిన్న రైతులైతే సూచించిన వాయిదాలలో చెల్లించేవారు. కానీ ఈ ట్రాక్టర్లను పొందినది బడా రైతులు కావడంతో వడ్డీ ఎందుకు దండగ, మొత్తం ఒకేసారి చెల్లిస్తే పోలా అనుకుంటూ రాయితీగా వచ్చిన సొమ్మును రుణానికి జమ చేసి వాయిదాలను చాలావరకు కట్టేశారు. ఇలా వాయిదాలను ఒకేసారి చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నారు. అంతేకాక ట్రాక్టర్లను ఏ ఒక్కరూ ఆర్‌బీకేల దగ్గర ఉంచడం లేదు. దీనిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

పెదపాడు మండలంలో..

మరోవైపు పెదపాడు మండలంలోను సబ్సిడీపై ట్రాక్టర్లు, వరికోత యంత్రాలను పొందిన రైతులు అధికారుల పరిశీలన కోసం ఆయా యంత్రాలను పెదపాడు సొసైటీ కార్యాలయానికి గురువారం తీసుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2021-22, 2022-23 సంవత్సరాల కాలంలో అర్హులుగా గుర్తించి 18 మంది రైతులకు ట్రాక్టర్లు, ఐదుగురు రైతులకు వరికోత యంత్రాలను సబ్సిడీపై అందజేశారు. అయితే వీటన్నింటిని నిబంధనల ప్రకారమే అర్హత గల రైతులకు అందజేశారా, లేక సబ్సిడీ నిధులు పక్కదారి పట్టాయా లేదా అన్నది విచారణలో తేలనుంది.

రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం : ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగిలో ఉన్న ట్రాక్టర్లను గురువారం రాత్రి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద రైతుల సౌలభ్యన్ని దృష్టిలో పెట్టుకుని 40 శాతం రాయితీపై ట్రాక్టర్లు, అనుబంధ యంత్ర పరికరాలను అందించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కదారి పట్టించి, వైసీపీ నాయకులు వాటిని తమ సొంత అవసరాలకు ఉపయోగించుకుంటూ తీసుకున్న రాయితీ పరికరాలను పేద రైతులకు అందకుండా చేశారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ నాలుగు మండలాల్లో కలిపి మొత్తం 62 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. అయితే పేద రైతులకు ఈ ట్రాక్టర్లు ఉపయోగపడడం లేదన్నారు. దీనిపై అధికారులను అప్రమత్తం చేసి ట్రాక్టర్లను ఆయా మండల కార్యాలయాలకు రప్పించాం. వాటిపై పేద రైతులకు తక్కువ ధరకే వ్యవసాయ అవసరాలను తీర్చడానికి అద్దెకు ఇవ్వబడును అని రాయించి, ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల దగ్గర రైతులకు అందుబాటులో ఉంచుతామని వివరించారు.



మంట పుట్టిస్తున్న కూరలు

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు
- మండుటెండలకు పంటల నష్టం
- ధరలు తగ్గాలంటే నెల రోజులు ఆగాల్సిందే

ఏలూరు టూటౌన్, జూన్ 20 : రోజురోజుకు కూరగాయల ధరలు పెరుగుతుండడంతో వినియోగదారుల్లో బెంబేలెత్తుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో మండుటెండలకు కూరగాయల పంటలన్నీ దెబ్బతినడంతో దిగుబడి తగ్గిపోయింది. మరోవైపు ప్రజల వినియోగం పెరగడంతో కొన్ని రోజులుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు మళ్ళీ రైతులు కూరగాయల పంటలు వేయడం ప్రారంభించారు. ఈ పంటలు మళ్ళీ దిగుబడికి వచ్చేసరికి 20 రోజుల నుంచి నెలరోజుల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు కూరగాయల ధరలను భరించక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు తగ్గించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఏలూరులో టమాటాలు రూ.74, వంకాయలు రూ.64, ఉల్లి రూ.38, బెండకాయలు రూ.52, బీరకాయలు రూ.68, క్యారెట్ రూ.56, దొండకాయలు రూ.40, బంగాళ దుంపలు రూ.36, దోసకాయలు రూ.28లు పలుకుతున్నాయి. భవిష్యత్తులో ఇంకా కూరగాయల ధరలు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం కలుగజేసుకుని కూరగాయల ధరల నియంత్రణకు కృషి చేయాలని, టామోటాలు, ఉల్లిపాయలు లాంటివి సబ్సిడీకి అందించాలని కోరుతున్నారు.

సబ్సిడీపై టమాటాలు అందించేందుకు చర్యలు

గత రెండు నెలలుగా వాతావరణ మార్పుల వల్ల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మే నెలలో ఎండల వల్ల మొత్తం పంటలు పాడైపోయాయి. దీంతో దిగుబడులు లేక ధరలు పెరిగాయి. కొత్తగా వేసిన పంటలు 20 రోజుల్లో అందుబాటులోకి వస్తాయి. పెరిగిన ధరలు నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. టామోటాలు సబ్సిడీపై అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- సుధాకర్, ఈవో, పత్తేబాదు రైతు బజారు

■ టమాటా కేజీ రూ.85



ముదినేపల్లి/ఆగిరిపల్లి : కూరగాయల ధరలు రోజు రోజుకీ పెరుగుతుండగా, టమోటా ధర మరింత స్పీడుగా పెరుగుతోంది. ముదినేపల్లి ప్రాంతంలో కేజీ టమోటా ధర రూ.85 పలుకుతోంది. గత వారం రోజులుగా రోజుకు ఈ ధర రూ.10 చొప్పున పెరుగుతూనే ఉంది. నాలుగైదు రోజుల్లో కేజీ టమోటా ధర రూ.వందకు చేరవచ్చునని వ్యాపారులే చెబుతున్నారు. రాష్ట్రంలో టమోటా పంట తగ్గడం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గడంతో ధరలు భారీగా పెరిగాయి. వినియోగదారులు టమోటాలు కొనుగోలు చేయాలంటేనే బెంబేలెత్తి పోతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



కూరగాయల ధరలు మాలాంటి సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రతిరోజు ఇంట్లో వాడుకునే వంకాయ, ఉల్లి, టమాటా నెల కిందట వరకు కేజీ రూ.20 నుంచి రూ.25 ఉండేవి. ఇప్పుడు కేజీ రూ.60 నుంచి రూ.70 వరకు ఎగబాకాయి. మూడు రెట్లు ధరలు పెరగడంతో కూరగాయలు కొనలేక పోతున్నాం. ధరలు నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టమాటాలు సబ్సిడీపై అందించాలి.

- గుళ్లపల్లి మురళి, వినియోగదారుడు, లక్ష్మీనగర్, ఏలూరు



ఏలూరు రైతుబజారు

పోలవరానికి ప్రాధాన్యం

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మల రామానాయుడు

పాలకొల్లు , జూన్ 20: రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంతో పాటు జిల్లాలో ముఖ్యమైన ప్రాజెక్టులన్నింటికి ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- 'గత ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్షంగా వ్యవహరించింది. కాల్వల్లో నీరు పారకుండా చేశారు. పంట కాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీతకు సంబంధించిన పనులపై తొలి సంతకం చేశా. వ్యవసాయ రంగానికి జీవం అందించే జల వనరుల శాఖ కేటాయించడం నా అదృష్టం. నేను నాకు ఇచ్చిన బాధ్యతను నూరుశాతం న్యాయం చేస్తాను. వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేసి రాష్ట్ర రైతులకు తీరని అన్యాయం చేసింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు సహకారంతో ఐదేళ్లలో పోలవరం పూర్తిచేసి రాష్ట్ర ప్రజలకు ఒక బహుమతిగా ఇవ్వడం మా బాధ్యత. పోలవరంతో పాటు సాగునీటి ప్రాజెక్టులు అన్నీ పూర్తిచేసి రాష్ట్రాన్ని దేశంలోనే వ్యవసాయ రంగంలో మరో మెట్టు పైకి తీసుకెళ్తాం' అన్నారు.



జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న నిమ్మల రామానాయుడు



216 హైవేపై చీకటి దందా

- కాకినాడ పోర్టు వయా నరసాపురం
- నరసాపురం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా దాటుతున్న అక్రమ రేషన్ బియ్యం

7

యోగా.. ప్రపంచానికి భారతదేశం పరిచయం చేసిన అద్భుత ఆరోగ్య ప్రక్రియ. యోగా వ్యాయామమే కాదు సంపూర్ణ ఆరోగ్య సాధన కోసం ఓ జీవన శైలి. మనిషి అంతఃకరణ దృష్టిని పెంచు కోవడంతో పాటు మానసిక పరివర్తనను సాధించుకోవడానికి యోగా ఉపయోగపడుతుంది. సంపూర్ణ ఆరోగ్యానికి, ఆనందానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఓ దివ్యౌషధం. రోగ రహిత సమాజం సాధనకు యోగా దివ్యమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. మహర్షులు వేసే ఆసనాలను శాస్త్రీయంగా క్రోడీకరించి యోగాశాస్త్రాన్ని పతంజలి మహర్షి మనకు అందించారు. భారతీయ ప్రాచీన కళ అయిన యోగా ప్రస్తుతం ప్రపంచ పటంలో భారతదేశం ఓ విశిష్ట స్థానాన్ని ఏర్పరచింది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

- నిడమర్రు/ఆకివీడు



శ్వాసపై ధ్యాసే యోగా

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా విశిష్టత..

మనిషి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసం ద్వారా మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడానికి యోగా ఓ ఉత్తమ సాధనంగా ఉంటుంది. యోగా ద్వారా మనిషి అద్భుత జీవన విధానాన్ని అలవర్చుకుంటాడు. యోగా అనగా సంస్కృతంలో శరీరం-మనసు స్పృహల కలయిక, ఏకం చేయడం అని అర్థం. ప్రాచీన కాలం నుంచి భారత ఇతిహాసాలైన రామాయణ, మహాభారత కాలాల్లో కూడా యోగా ప్రస్తావన కలదు. రాముడు ధ్యానం చేసినా, శ్రీకృష్ణుడు యోగ నిద్రలో ఉన్న అవన్నీ యోగ విద్యలో అంతర్భాగమేనని పురాణాలు చెబుతున్నాయి. యోగా విద్య అన్నింటినీ ఆవపోషణ చేసి వీటిని శాస్త్రీయంగా రూపకల్పన చేసిన ఘనత రాజగురువు పతంజలికే దక్కుతుంది. పతంజలి పేర్కొన్న యోగ విధానాలు.. యమ, నియమ, ఆసన, ప్రాణాయామం, ప్రత్యాహ, ధారణ, ధ్యానం, సమాధి క్రియల ద్వారా యోగా సిద్ధి సాధించవచ్చని తెలిపారు.

21న ఎందుకంటే..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ 21న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 24న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ జూన్ 21న అంర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవాలని సూచించగా 193 మంది ప్రతినిధులలో 173 మంది దీనికి మద్దతు ఇచ్చారు. భద్రతామండలి దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, రష్యా, చైనా, ఇంగ్లాండ్ దేశాలు విస్తృత చర్చ అనంతరం ఆమోదించాయి. ప్రతి సంవత్సరం జూన్ 21 నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి కారణం ఈ భూమి మీద ఉత్తరార్ధ గోళంలో అత్యధిక సమయం పగలు ఉండే రోజుగా ప్రసిద్ధి కెక్కింది. ఈరోజు విశిష్టను గుర్తించి మోదీ జూన్ 21న యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి సూచించగా అందరూ ఆమోదించారు. దీంతో



తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం ను జూన్ 21, 2015న సరేంద్ర మోదీ న్యూఢిల్లీలో నిర్వహించారు. నేడు 2024 పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నరేంద్ర మోదీ కశ్మీర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవ నినాదం 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'గా నిర్ణయించి ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు.

మానసిక ప్రశాంతత కోసం ధ్యానం

నేటి ఆధునిక జీవనశైలి ఒత్తిడిని అధిగమించాలంటే యోగా ఒక్కటే ఏకైక మార్గం. యోగాలో ధ్యానం సాధన చేయడం ద్వారా మెదడులో పేరుకుపోయిన ఒత్తిడి నుంచి దూరం చేయవచ్చు. ధ్యానం చేయాలంటే ముందుగా సుఖాసనంలో కూర్చొని రెండు చేతులు చిన్ముద్రలో ఉంచుకొని కళ్లుమూసుకొని కేవలం శ్వాస మీద ధ్యాసే కల్గి ఉండాలి. మనిషి వయస్సుకు తగ్గట్టు అన్ని నిమిషాలు ధ్యానం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చని యోగా నిపుణులు సూచిస్తున్నారు.

యోగా లోగో విశిష్టత

యోగా లోగోకు ఓ విశిష్టత ఉంది. లోగోలో మనిషి రెండు చేతులు మడతపెట్టి పైకి లేపుతూ యోగంను చూపిస్తున్నది. ఇది వ్యక్తిగత స్పృహతో పాటు, ఐక్యతను ప్రతిబింబిస్తుంది. మనసు - శరీరం- ప్రకృతిల మధ్య సంపూర్ణ సామరస్యాన్ని ఈలోగో సూచిస్తుంది.



ఆరోగ్యం కోసం ఆసనాలు..

యోగా అంటే అందరికీ ముందుగా స్మరణకు వచ్చేది యోగాసనాలే. అత్యంత ఎక్కువగా ప్రాచుర్యం పొందిన యోగా క్రియ ఇది. ఈ యోగాసనాలు ఏడేళ్ల వయసు నుంచి తొంభై ఏళ్ల ముదుసలి వరకు వారి ఆరోగ్య స్థితిని అనుసరించి యోగాసనాలు చేయవచ్చని యోగా గురువులు తెలియజేస్తున్నారు. ఆసనాలలో ముఖ్యమైనవి సూర్యనమస్కారములు. యోగాసనాలలో అత్యంత ప్రాచుర్యం పొందినవి వజ్రాసనం, ప్రణమాసనం, వ్యాఘ్రాసనం, సర్వాంగసనం, మత్స్యాసనం, వృక్షాసనం, హలాసనం, చక్రాసనం, నావాసనం మొదలగునవి.

యోగాసనాలు వల్ల లాభాలు..

యోగాసనాలు చేయడం ద్వారా మనిషికి కండర బలం వృద్ధి చెందుతుంది. శ్వాసక్రియ పెరిగి శక్తి ఉత్తేర్జం అవుతుంది. సమతుల జీవనక్రియ పెంపొందుతుంది. బరువు తగ్గి ఆరోగ్య స్థితిని పొందవచ్చు. గుండె, రక్త ప్రసరణ ఆరోగ్యవంతమవును. ఇవేకాకుండా మనిషి దీర్ఘకాలిక రోగాలైన నరాల బలహీనత, రక్తపోటు, మధుమేహం, ఉబ్బసం, ఊబకాయం వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. సర్వజనులకు యోగము సర్వరోగ నివారిణి.

అనారోగ్య సమస్యలు పరిష్కారం



యోగా వల్ల మనిషి నైతిక ప్రవర్తనలో మార్పు సాధ్యం. ఒత్తిడిని జయించవచ్చు. ఊబకాయం, అధిక రక్తపోటు, కీళ్లనొప్పులతో పాటు ఆధునిక జీవన విధానంలో వచ్చే ప్రతి ఆనారోగ్య సమస్యకు సూర్యనమస్కారాల్లో పరిష్కారం ఉంది.

- నూకల రియశ్రీ, విద్యార్థిని, ఆకివీడు

యోగాతో ఆరోగ్యం



యోగాకు రాకముందు ఒత్తిడి, కోపం, కాళ్ళు లాగడం తదితర సమస్యలుండేవి. యోగా చేసిన దగ్గర నుంచి సమస్యలు తగ్గాయి. యోగాకు వెళ్లడం వల్ల శ్రమనుకుంటే రానున్న రోజుల్లో అదే మనకు భారమై కూర్చుంటుంది. ప్రతీ ఒ క్కరూ శ్రమ నుకోకుండా యోగాకు వెళ్లి ఆరోగ్యవంతులుగా జీవించాలి.

- వడలి శైలజ, మహిళా పోలీసు, ఆకివీడు

ఉచితంగా యోగా శిక్షణ



నాలుగు దశాబ్దాల పైబడి ఉచితంగా యోగా అందిస్తున్నాం.. 1983 వరకు అనేక సమస్యలతో బాధపడుతుండేవాడిని. యోగా వల్లే బతికున్నా.. గురూజీ సూర్యరాఘవదీక్షితులు వద్ద యోగా భ్యాసం, ముక్కు-డొక్క కడగడం నేర్చుకుని అప్పటి నుంచి నేటి వరకు అనేకమంది శిష్యబృందానికి యోగా, ఆసన, ప్రాణాయామం, ధ్యానం నేర్పుతున్నాను.

- కందుల సత్యనారాయణ, యోగాసనాచార్య, ఆకివీడు

యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు..



అందరికీ యోగా అందలానే సంకల్పంతో యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు చేయడం జరిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి, విశాఖపట్నం ప్రాంతాలలో యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి యోగ సాధన నేర్పిస్తున్నాం.

- యోగాచార్య సాంబశివరావు, యోగా ప్రచార పరిషత్, ఆకివీడు

ధ్యానంతో మానసిక, ఆధ్యాత్మిక పరిపక్వత



ధ్యానం మనిషిలో మానసిక, ఆధ్యాత్మిక పరిపక్వతను పెంపొదిస్తుంది. విద్యార్థులు ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత పెంచుకొని చదువులో అత్యున్నత ప్రమాణాలు పొందగలడు. మనిషి తన గురించి తాను తెలుసుకునే అద్భుత ప్రక్రియే ధ్యానం. మనలోకి మనం చూసుకొనే చక్కని అవకాశం ధ్యానం మనకు కల్పిస్తుంది.

- పెరుమాళ్ళ మురళీకృష్ణ, యోగా గురువు , గణపవరం



పట్టుబడిన బియ్యం లారీలు (ఫైల్)

216 హైవేపై చీకటి దందా

కాకినాడ పోర్టు వయా నరసాపురం

- నరసాపురం నుంచి జిల్లా దాటుతున్న అక్రమ రేషన్ బియ్యం
- కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి అక్రమ రవాణా
- గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడి వైనం.. ఇంకా ఇదే తీరు..

గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఇంకా చెక్ పడలేదు. ప్రభుత్వం మారినా ఇంకా చీకటి దందా కొనసాగుతూనే ఉంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి రాత్రి సమయాల్లో బియ్యం లారీలు యథేచ్ఛగా పశ్చిమ గోదావరి జిల్లాలోని 216 హైవేపై నరసాపురం వద్ద సరిహద్దు దాటి కాకినాడకు వెళ్లిపోతున్నాయి. అక్కడ నుంచి పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందా వైసీపీకి చెందిన ఓ మాజీ నేత కన్నుసన్నల్లోనే ఇంకా సాగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నరసాపురం, జూన్ 20: కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం తెల్లకార్డుదారులకు ఉచితంగా 20 కేజీల రేషన్ బియ్యం అందించింది. దాదాపు ఏడాది పాటు ఈ బియ్యం పంపిణీ చేశారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో మాదిరిగానే రేషన్ బియ్యం ఇచ్చింది. ఎక్కువ మంది ఈ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడలేదు, బయట మార్కెట్‌లో అమ్ముకున్నారు. వాటిని కొంతమంది బ్రోకర్లు కొనుగోలు చేసి కాకినాడకు తరలించారు. మొదట్లో అంతా రైస్ మిల్లర్లకు తరిస్తున్నారని భావించారు. అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో లారీలు జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మీదుగా చించినాడ మీదుగా కోనసీమకు వెళ్లాయి. ఈ దంతా అంతా రాత్రి సమయాల్లోనే సాగింది. అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అప్పట్లో ఈ లారీలను పెద్దగా పట్టించుకోలేదు. అడపాదడపా ఒకటి రెండు లారీలు పట్టుకుని చేతులు దులుపుకునేవారు.

కొత్త ప్రభుత్వంలోనూ ఆగని దందా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. బియ్యం ఎగుమతులు మాత్రం తగ్గలేదు. రాత్రి సమయాల్లో యథేచ్ఛగా లారీలు తీరం నుంచి సరిహద్దు జిల్లా దాటుతున్నాయి. ఈ జిల్లాల్లోని కొంతమంది బ్రోకర్లు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని కాకినాడకు తరలిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా లారీలు తక్కువ సంఖ్యలోనే తరలిపోతున్నాయి. ఇవి కూడా అర్ధరాత్రి సమయాల్లోనే. తీరంలో ఎక్కడా తనిఖీలకు చెక్ పోస్టులు అంటూ లేవు, సమర్థవంతమైన నిఘా కూడా లేకపోవడంతో ఈ చీకటి దందాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ప్రస్తుతం 216 జాతీయ రహదారి పూర్తయి ట్రాఫిక్ పెరిగినా.. ఆ స్థాయిలో పోలీస్ నిఘా మాత్రం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే చీకటి దందాలకు తీర ప్రాంతం రహదారి అడ్డాగా మారింది.

వరకట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 20 : పట్టణానికి చెందిన మహిళ తన భర్త అధిక కట్నం కోసం వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ వీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన తేజస్వి ద్వారకాతిరుమల మండలం కొత్తపల్లికి చెందిన రెడ్డి పవన్‌కుమార్‌కు 2021లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉనానడు. ఇటీవల అదనపు కట్నం కోసం తన భర్త మద్యం సేవించి చిత్రహింసలకు గురిచేస్తున్నాడని, అతడికి కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

- త్వరలో ఏలూరులో రెవెన్యూ చట్టాలపై అవగాహనకు శిక్షణ కేంద్రం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 20 : భారతదేశంలో 1786లో తొలిసారిగా బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆవిర్భావం పురస్కరించుకుని ఏటా జూన్ 20న జరుపుకునే రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాలనుంచి రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు ఆర్డీవో ఖాజావలీ మాట్లాడుతూ రెవెన్యూశాఖ చరిత్ర, విశిష్టతను వివరించారు. ఎప్పటికప్పుడు ప్రజలకు మరిన్ని మంచి సేవలను అందించేలా చట్టాలపై విస్తృత అవగాహన ఉండాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి ప్రమోద్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ ఉద్యోగులు సరిహద్దులో సైనికునివలే అలుపెరుగని సేవలను ప్రజలకందించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కోసం ఏలూరు కేంద్రంగా త్వరలోనే ఓ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి జరుగుతోందన్నారు. ఉద్యోగకాలంలో అత్యుత్తమ సేవలందించిన రిటైర్డ్ తహసీల్దార్లు వి.వి.జగన్మోహనరావు, ఎం.హెచ్.మణి, బి.బెన్నీ, ఎస్.సత్యనారాయణ, జి.జే.ఎస్.కుమార్, రామకృష్ణ, ఆర్.పోతురాజు, సీతారాం, రిటైర్డ్ ఆఫీస్ సబార్డినేట్ రాఘవులును ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు కె.రవిచంద్ర, మాధవి, శ్రీనునాయక్, మల్లేశ్వరరావు, ప్రసాద్‌బాబు, కృష్ణస్వామి, బలుసు గీతిక, గ్రామ రెవెన్యూ అధికారులు, వార్డు రెవెన్యూ కార్యదర్శులు, గ్రామ సర్వే సహాయకులు పాల్గొన్నారు.



రెవెన్యూ డే వేడుకల్లో రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ తహసీల్దార్లు

క్రైం సమాచారం

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూన్ 20 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి గురువారం సాయంత్రం ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు జారి రైలు కిందపడి మృతి చెందాడు. విశాఖపట్టణం నుంచి విజయవాడ వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ఆగిన తరువాత పవర్‌పేట రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తుంది. ఆ స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు కల్గిన వ్యక్తి జారి రైలు చక్రాలు కిందపడి రెండు ముక్కలైపోయాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, జూన్ 20 : కుమారుడి మోటారు సైకిల్ ఎక్కుతున్న ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు కళ్లు తిరిగి కిందపడి తలకు బలమైన గాయమై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఏలూరు బావిశెట్టివారిపేటకు చెందిన వీరనాల కనకమ్మ (67) తన కుమారుడైన కాశీనాథ్ వద్ద ఉంటుంది. ఈనెల 18వ తేదీ సాయంత్రం కిరాణాషాపునకు కుమారుడితోపాటు ఆమె వెళ్లారు. తిరిగి వచ్చే నిమిత్తం ఆమె కుమారుడు బైక్‌పై ఎక్కుతూ కళ్లు తిరిగి కిందపడిపోయారు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

ఏలూరు క్రైం, జూన్ 20 : ఇంటికి తాళం వేసి ఊరువెళ్ళి తిరిగి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటి తాళం పగులగొట్టి బంగారపు ఆభరణాలు, నగదు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు సత్యనారాయణపేట సచివాలయం సమీపంలో నివాసం ఉంటున్న మత్తి శ్రీనుబాబు 19వ తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి నరసాపురంలోని మేనల్లుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం వచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టారు. ఇంట్లోని సూత్రాల గొలుసు, చైన్, ఉంగరాలు, డాలర్ ఒకటి, చెవి దిద్దులు, పది తులాల వెండి అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిడ్డను కొన్న మహిళపై కేసు

ఏలూరు క్రైం, జూన్ 20 : బంధువుల వద్ద నుంచి చట్ట వ్యతిరేకంగా ఒక మగ శిశువును కొనుగోలు చేసిన మహిళపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన దాట్ల సాయిభవానీ ప్రసన్నకు సంతానం లేరు. ఈక్రమంలో వారి బంధువులు గుంటూరులో ఉండడంతో వారి వద్ద నుంచి రూ.20 వేలకు 13 నెలల మగ శిశువును కొనుగోలు చేశారు. వట్లూరు ప్రాంతంలోని అంగన్‌వాడీ టీచర్‌కు అనుమానం కల్గి వెంటనే చైల్డ్‌లైన్‌కు సమాచారమిచ్చారు. చైల్డ్‌లైన్ ఆఫీసర్ చల్లా జాహ్నవి తన సిబ్బందితో వట్లూరు వెళ్లి దాట్ల సాయిభవానీ ప్రసన్న వద్ద ఉన్న 13 నెలల సతీష్ అనే బిడ్డను స్వాధీనం చేసుకుని శిశుగృహలో ఉంచారు. చట్ట వ్యతిరేకంగా పసి బిడ్డను కొనుగోలు చేసిన మహిళపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకరిపై ముగ్గురి దాడి.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూన్ 20 : ఓ వ్యక్తిని ముగ్గురు కలిసి కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ వీసీహెచ్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తగరం నాగరాజు ఈనెల 17న ఇంటివద్ద ఉన్న సమయంలో పాలకుంట మహేష్, మరో ఇద్దరు బయటకు రమ్మని పిలిచారు. నాగరాజు రావడానికి సమ్మతించకపోవడంతో వారిమధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో మహేష్‌తో మరో ఇద్దరు కలిసి నాగరాజుపై దాడి చేశారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

ట్రావెల్స్ బస్సు-ఆటో-లారీ ఢీ

- తప్పిన పెను ప్రమాదం.. ఇద్దరికి స్వల్పగాయాలు



లక్ష్మీపురం వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

జీలుగుమిల్లి, జూన్ 20 : జాతీయ రహదారిపై లక్ష్మీపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఉదయం ట్రావెల్ బస్సు, లారీ, ఆటో మూడు వాహనాలు ఒకేసారి ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. లక్ష్మీపురం సెంటరులో రోడ్డు మలుపు వద్ద తాడువాయి నుంచి వస్తున్న ఆటో.. లారీని క్రాస్ చేస్తుండగా ఎదురుగా హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళుతున్న ట్రావెల్స్ బస్సు వచ్చింది. ఆటోను తప్పించే క్రమంలో బస్సు డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేయడంతో బస్సు లారీ ఢీ కొన్నాయి. పెను ప్రమాదం తప్పింది. బస్సు ముందు అద్దాలు పగిలాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఘటనకు గల కారణాలు సేకరించారు. కేసు నమోదు చేశామని హెచ్‌సీ నాగేశ్వరావు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ



బర్రింకలపాడు వద్ద పొలంలో రాగివైరు చోరీకి గురైన దృశ్యం

జీలుగుమిల్లి, జూన్ 20 : బర్రింకలపాడు శివారు పొలాల్లో గుర్తు తెలియని దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ చేశారు. రైతు కుంజా శాంతమ్మ పొలంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం వెళ్లి చూడడంతో స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కిందకు దింపి దానిలో రాగివైరు దొంగలు పట్టుకు పోయారు. సంబంధిత శాఖ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు. ఇటీవల ములగలంపల్లి సమీప పొలాల్లో రైతుల వ్యవసాయ బోర్ల వద్ద మరమ్మతుకు గురైన సుమారు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు నెల గడుస్తున్నా ఇప్పటికి బిగించలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరి నారుమడులు తొలకరి పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైర్ల చోరీతో బెంబేలెత్తుతున్నారు. రాత్రి సమయంలో పొలాల్లో నిఘా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని గిరిజన గ్రామాల రైతులు కోరారు.

డబ్బులు వసూలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 20 :బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీగణపతి తోపుడు బండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు పిండి రాము కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయనతో పాటు పలు పండ్లదుకాణాల యజమానులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాలపై శిక్షణ ఇచ్చే సంస్థ ప్రతినిధులమని కొంతమంది అపరిచిత వ్యక్తులు తమ పండ్ల దుకాణాల వద్దకు వచ్చి రూ.1416 కట్టాలని లేదంటే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేత పండ్లదుకాణాలు మూయించివేస్తామని బెదిరిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామరాజును వివరణ కోరగా ఇండియన్ ఫుడ్ సొల్యూషన్ అనే కంపెనీ థర్డ్ పార్టీ కంపెనీ అని ఫుడ్ వ్యాపారం చేసే వ్యాపారస్తులకు ఈ సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తారని తెలిపారు. శిక్షణ పొందడానికి వ్యాపారస్తులకు ఇష్టమైతేనే తప్ప బలవంతంగా వారి నుంచి డబ్బులు కట్టించుకోకూడదన్నారు.



శ్రీవారి ప్రసాదాలను అందుకుంటున్న మంత్రి ఆనం

దేవదాయ శాఖ మంత్రికి శ్రీవారి ఆశీర్వచనం

ద్వారకాతిరుమల, జూన్ 20: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శ్రీవారి ఆలయ అధికారులు, అర్చకులు సచివాలయంలోని ఆయన చాంబర్‌లో గురువారం కలసి సత్కరించారు. ముందుగా ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని అందించారు. అనంతరం ఆలయ ఈవో త్రినాథరావు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని, శ్రీవారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.



మంత్రి సత్యప్రసాద్‌ను అభినందిస్తున్న రెవెన్యూ సంఘ నాయకులు

మంత్రిని కలసిన రెవెన్యూ అధికారులు

ఏలూరు రూరల్, జూన్ 20 : అమరావతిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజురవీంద్రరాజు ఆధ్వర్యంలో నాయకులు కలిసి సత్కరించి అభినందించారు. రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మల రామానాయుడిని కలిసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, ఎ.మౌలీబాషా, ఎం.లక్ష్మీనారాయణ, మద్దాల బాపూజి, ప్రసన్నలక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మరాజును కలసిన ఉద్యాన వర్సిటీ వైస్ చాన్సలర్



ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరిస్తున్న వైస్ చాన్సలర్ జానకీరామ్, సిబ్బంది

ఉంగుటూరు, జూన్ 20 :వెంకట్రామన్న గూడెం ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ జానకీరామ్, సిబ్బంది గురువారం ఉంగుటూ రు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయంలోని పరిస్థితులు, కావాల్సిన నిధు లు, సౌకర్యాలపై సమీక్షిం చారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను జంగారెడ్డిగూడెం సమీపంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈవో, ఆలయ అర్చకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

పెన్షన్‌దారులకు ఇన్‌కం టాక్స్ రికవరీ ఫారం-16 జారీ : రవివర్మ

భీమవరంటౌన్, జూన్ 20 ఉప ఖజానా కార్యాలయం భీమవరం పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇన్‌కంటాక్స్ రికవరీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఫారం-16ను గురువారం నుంచి జారీ చేశామని ఉప ఖజానా అధికారి అల్లూరి రవివర్మ తెలిపారు. సంబంధిత పింఛన్‌దారులు కార్యాలయం పనిచేసే సమయంలో పొందవచ్చన్నారు. గురువారం కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఫారం అందించి ఆయన మాట్లాడారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేమ్స్ మాట్లాడుతూ రికవరీ చేయబడిన పెన్షనర్స్‌ఫారం-16ను తీసుకొని ఐటీ రిటర్న్‌లను వచ్చేనెల 31లోపు దాఖలు చేయాలని, సందేహాలుంటే పెన్షనర్స్ అసోసియేషన్ వారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు, భీమవరం యూనిట్ కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, కోశాధికారి సూర్యనారాయణ, జీవీ సత్యనారాయణరాజు, జేవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏయూ భాస్కరరావు, అప్పన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్ల నుంచి భద్రాచలం పాదయాత్రగా వెళుతున్న టీడీపీ అభిమానులు

టీడీపీ అభిమానుల భద్రాచలం పాదయాత్ర

జీలుగుమిల్లి, జూన్ 20: చంద్రబాబు సీఎంగా అధికారం చేపట్టటంతో తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల శివారు తిమ్మన్నపాలెం వాసులు భద్రాచలం పాదయాత్ర చేపట్టారు. ఎంపీటీసీ రావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో 50 మంది పాదయాత్రగా బయలుదేరారు. గతంలో సీఎం చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపడంతో క్షేమంగా జైలు నుంచి బయటకు రావాలని వారంతా భద్రాచలం పాదయాత్ర చేశారు. ఆసయమంలో రాష్ట్ర సరిహద్దు దాటే వరకు పోలీసులు పార్టీ జెండా కనిపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారని, సరిహద్దు ప్రాంతం దాటిన తర్వాత పార్టీ కండవాలు జండాలు వేసుకుని పాదయాత్ర సాగించినట్లు చెప్పారు. చంద్రాబాబు సీఎంగా చూడాలని మొక్కుకున్నామని, మొక్కు చెల్లించేందుకు పాదయాత్రగా తరలి వెళుతున్నామని తెలిపారు.

చింతలపూడి ఎత్తిపోతలు పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే రోషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కామవరపుకోట, జూన్ 20 : చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గుంటుపల్లి పంచాయతీ కంతమనేనివారిగూడెంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యానారాయణ అధ్యక్షతన గురువారం కూటమి సమావేశం నిర్వహించారు. కూటమి విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే రోషన్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, బేతిన వెంకట్రావు, కంతమనేని పుష్పరాజ్యం, అంజిమూర్తి, కంతమనేని చిన సత్యనారాయణ, రేగుంట సురేష్, నూతి లక్ష్మీనారాయణ, జుజ్జూరి బాబ్జీ, డోలా విజయ్, సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు, వేముల నాగేశ్వరరావు, గోరింక దాసు, జనసేన మండల కన్వీనర్ షేక్ వల్లీ, బీజేపీ నాయకులు ఒంటెద్దు ఏసువరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీర్లతో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై గ్రామాల వారీగా ఆరా తీశారు. ప్రతీ పనికి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తికావాలని సూచించారు. అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న సంఘ నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 20: మంత్రివర్గం, పార్టీ పదవుల్లో, యాదవులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి ప్రాధాన్యం ఇచ్చారని యాదవ సంఘం జిల్లా నాయకులు అన్నారు. యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఉక్కుసూరు గోపాలకృష్ణ మాట్లాడారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. నూజివీడు ఎమ్మెల్యే పార్థసారథి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, పెనుకొండ ఎమ్మెల్యే ఎస్.సవితకు మంత్రివర్గంలో స్థానం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. గొర్ల రామారావు, బొట్టా అజయ్, ఆకుల గంగాధర్, చిట్టిబోయిన సాయిబాబు, చిదరబోయిన వెంకటేశ్వరరావు, నెరుసు నెలరాజు, బోడా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలసిన అప్పలనాయుడు



పవన్‌కల్యాణ్‌తో అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 20: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పల నాయుడు గురువారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని కూటమికి విజయం చేకూర్చారని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారన్నారు. ఏలూరు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

తెలంగాణ మాజీ మంత్రిని కలసిన పుట్టా మహేష్



శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించిన మహేష్

ఏలూరు టూటౌన్, జూన్ 20: తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ పరామర్శించారు. శ్రీనివాస్ యాదవ్ తమ్ముడు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల మరణించారు. గురువారం ఎంపీ పాల్గొని నివాళులర్పించారు.

జనసేన శ్రేణుల సంబరాలు



కేక్‌కట్ చేసిన జనసేన నాయకులు

భీమడోలు, జూన్ 20: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా భీమడోలులో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేశారు. ప్రత్తి మదన్ ఆధ్వర్యంలో గురువారం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. మదన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, పవన్ కల్యాణ్ మంత్రిత్వ శాఖల ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాటిమళ్ళ రామ్మూర్తి, దుర్గా పల్లవి, నీలం అజయ్, దుర్గారావు, నరసింహ మూర్తి, లీలా కృష్ణ, వెంకటేశ్వరరావు, ఘంటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూన్ 20: నియోజకవర్గంలో రెవెన్యూ శాఖ పరిధిలోని సమస్యలపై ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గురువారం సమీక్షించారు. రేషన్ సమస్యలు, రైతుల మ్యూటేషన్ తదితర సమస్యలపై తహసీల్దార్ల నుంచి సమాచారం తెలుసుకున్నారు. ఈ సమీక్షలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం తహసీల్దార్లు, సివిల్ సప్లైస్ డీటీలు, తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

రైతులకు అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు



విప్పలపాడులో వరి నారుమడి పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



చింతలపూడిలో కొబ్బరి తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



జంగారెడ్డిగూడెంలో పచ్చిరొట్ట పైరు పరిశీలిస్తున్న సిబ్బంది

బుట్టాయగూడెం, జూన్ 20: సార్వా సాగుకు రైతులు సన్నద్ధం కావడంతో విత్తనశుద్ధి, నారుమడులపై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలు ఇస్తున్నారు. వరి నారుమడి వేయడానికి ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు సూచించారు. మండలంలో 4420 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారని, 221 ఎకరాల నారు అవసరమని ఆయన తెలిపారు. మండలంలోని రెడ్డి గణపవరం, జైనవారిగూడెం, విప్పలపాడు గ్రామాల్లో గురువారం ఆయన వరి నారుమడులను పరిశీలించారు. ఎకరాకు సరిపడా నారుమడిని సిద్ధం చేసుకోవాలని మట్టి గడ్డలు లేకుండా కలియ దున్ని దమ్ము చేయాలన్నారు. ఎకరాకు 25-30 కిలోల విత్తనాలు అవపరమని, నారు పోయడానికి ముందే నారుమడిని 15 రోజుల ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా మడులను సిద్ధం చేయాలని, 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ దుక్కిలో వేయాలన్నారు. నారు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు పెట్టాలని, జింక్ లోపం నివారణకు జింక్ సల్ఫేట్‌ను పిచికారి చేయాలని, విత్తిన 10 రోజులకు 3జి కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి నాణ్యమైన నారును సిద్ధం చేసుకోవచ్చని తెలిపారు.

కొబ్బరిలో నల్లముట్టు పురుగు తగ్గుముఖం

చింతలపూడి: మండలంలోని కొబ్బరితోటల్లో వ్యాపించిన నల్లముట్టు పురుగుల తీవ్రత తగ్గిందని అంబాజీపేట శాస్త్రవేత్తలు డాక్టర్ బీఎన్‌వీ చలపతిరావు తెలిపారు. మండలంలోని అల్లిపల్లిలో గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. గడచిన మార్చిలో కొబ్బరితోటల్లో నల్లముట్టు తెగులు గుర్తించి నివారణకు సూచనలు ఇచ్చారు. ఎల్‌వోడీపీ స్కీమ్‌లో భాగంగా 53 హెక్టార్ల కొబ్బరితోటలకు బ్రకాన్, గోనియోజూస్ బదిలికలు ఇచ్చారు. మిత్రపురుగులు విడుదల చేసిన తరువాత జరిగిన సర్వేలో శాస్త్రవేత్తలు కొబ్బరితోటల్లో 50 నుంచి 60 శాతం నల్లముట్టు పురుగుల తీవ్రత తగ్గినట్లు గుర్తించారు. మిత్ర పురుగులను అధిక సంఖ్యలో ఉత్పత్తిచేసే విధంగా శిక్షణ ఇచ్చి రైతులకు సహకరిస్తామని చలపతిరావు తెలిపారు. మిత్రపురుగులు విడుదల చేసిన తోటల్లో 90 శాతం తీవ్రత తగ్గిందని చెప్పారు. కీటక విభాగ శాస్త్రవేత్త అనూష, చింతలపూడి ఉద్యానవనశాఖ అధికారి ఎండీ షఫియా, కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరక్టర్ కుమార్‌వేల్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

550 ఎకరాల్లో వరి నారుమడి

జంగారెడ్డిగూడెం: మండలంలో 550 ఎకరాల్లో రైతులు వరి నారు వేసినట్లు మండల వ్యవసాయాధికారి కేవీఎస్.పోశారావు గురువారం తెలిపారు. 13 వేల ఎకరాలలో వరి సాగుకు నారు సరిపోతుందన్నారు. భూసారం పెరగడానికి శాఖాపరంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే జనుము, జీలుగ, పిల్లిపెసర 60 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ప్రతీ ఐదెకరాలకు నలభై కేజీల చొప్పున అందించామన్నారు. జూలై 15 తర్వాత వరినాట్లు ప్రారంభమవుతాయని పోశారావు తెలిపారు.



అవార్డులు అందుకున్న డీఎస్పీలను అభినందిస్తున్న ఎస్పీ

పోలీస్ అధికారులకు సత్కారం

ఏలూరు క్రైం, జూన్ 20: జిల్లాలో ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించి, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసులు కష్టపడి పనిచేశారని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులకు ఎస్పీ మెమెంటోలను అందించారు. జిల్లాలో పోలీస్ యంత్రాంగం కృషితో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించగలిగామని అన్నారు. ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో, ఇదే స్ఫూర్తితో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన అధికారులను ఈ సందర్భంగా సత్కరించారు.

సస్పెండైన అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 20 : ఎన్నికల సందర్భంగా సస్పెండైన పీవో, ఏపీవోలకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలంటూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాను యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు గురువారం కలుసుకుని వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారనే కారణంపై కొందరు ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని, వారికి తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని అభ్యర్థించామన్నారు. కొందరు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని, వారికి కూడా పోస్టింగ్ ఇచ్చి, షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని కోరారు. ఎన్నికల విధులు నిర్వర్తించిన రోజులకు డ్యూటీ సర్టిఫికెట్ల ఆదారంగా సంపాదిత సెలవులను మంజూరు చేసేలా తగిన ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సీఈవోను కలిసిన వారిలో ఎమ్మెల్సీ కేఎస్.లక్షణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



చిన రామాలయం వద్ద నిలిచిన వర్షం నీరు

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, జూన్ 20: మండలంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గూటాల హైస్కూలు ఎదుట వీధి, పట్టిసీమ వీరభద్రపురం, ప్రగడపల్లి చర్చి సెంటర్, పోలవరం బాపూజీ కాలనీ, కొత్తపేట కాలనీ, బీసీ కాలనీ, కమ్మరగూడెం సెంటర్ డ్రైనేజీ, మెయిన్ రోడ్డులో చిన రామాలయం సెంటర్, తిరుమల డైరీ సెంటర్, పాతపోలవరం సెకండ్ రోడ్డులో వర్షపు నీరు నిలిచి ప్రజానీకం అవస్థలకు గురయ్యారు.

కనీస మద్దతు ధరలు పెంచాలి

ఏలూరు టూటౌన్, జూన్ 20: కేంద్ర ప్రభుత్వం 14రకాల పంటలకు మద్దతు ధర నామమాత్రంగా పెంచడం తగదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిపార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచలే దన్నారు. వరి క్వింటాకు కేవలం రూ.117 పెంచారన్నారు. ఎరువులు, పురుగు మందులు పెట్రోలు, డీజిల్, రవాణా ఖర్చులు పెరిగాయన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 20: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ ఎన్.నరేంద్రకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. బండి వెంకటేశ్వరరావు జె.వి.రమణరాజు, కొత్తూరి నాగేశ్వరరావు, బొక్కా శ్రీను, కంతేటి వెంకట్రావు, కార్యదర్శి ఎన్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు

జంగారెడ్డిగూడెం, జూన్ 20: పొగాకు వేలం కేంద్రం-2 పరిధిలోని రైతులకు గురువారం వేలం నిర్వాహణాధికారి జె.సురేంద్రకుమార్ సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ప్రతీ హెక్టారుకు 20 కేజీల విత్తనాలు అవసరమవుతాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెరుగుతందన్నారు. అలవల శ్రీనివాసరెడ్డి, టి.వెంకాయమ్మ, అలవల మహేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు అందజేత

చింతలపూడి, జూన్ 20: ప్రగడవరం రైతుభరోసా కేంద్రంలో సబ్సిడీపై విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. ఏవో కె.మీనాకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో సుమారు 10హెక్టార్లలో రైతులు విత్తనోత్పత్తి పథకంలో ఎంపికయ్యారని, ఎంటీయూ 1061 రకం సబ్సిడీపై అందజేస్తున్నామని చెప్పారు. కె.రాజారెడ్డి, సర్పంచ్ భూపతిరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

కొయ్యలగూడెం, జూన్ 20: తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. కేకుకట్ చేసి విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ దివ్య, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం, జూన్ 20: పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మండలంలోని అక్కంపేట గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎన్.ఉమా తెలిపారు.

మంత్రి నిమ్మల దృష్టికి ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 20: జల వనరులశాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టిన నిమ్మల రామానాయుడిని ఏపీ ఇరిగేషన్ ఉద్యోగులు సమస్యలు వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ నేతృత్వంలోని ఉద్యోగుల బృందం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలోనే ఉద్యోగసంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు.

నేడు యోగా దినోత్సవం

పెదపాడు, జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వట్లూరులోని టీటీడీసీలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ ఆఫీసరు పి.వి.ఎస్.ఎస్.చౌదరి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బెదిరింపులు



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 20: మధ్యాహ్న భోజన పథకం కార్మికులను వైదొలగాలని అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని, ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘం నాయకులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో డీఈవో అబ్రహంకు ఫిర్యాదు చేశారు. సంఘ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ పెదవేగి, ద్వారకా తిరుమల, దెందులూరు, భీమడోలు మండలాల్లో గ్రామస్థాయి నాయకులు భోజన పథకం కార్మికులను తొలగిస్తామంటూ హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులపై అధికారపార్టీ జులుం ప్రదర్శించడం సరి కాదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారినే కొనసాగించాలని కోరారు. బెదిరింపులు ఆపకుంటే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. దీనిపై డీఈవో అబ్రహంను వివరణకోరగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనపథకం అమలు, పర్యవేక్షణకు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోతో త్రిసభ్య కమిటీ ఉందన్నారు. ఆహార పదార్థాల నాణ్యతాలోపం, సమయానికి భోజనం పెట్టడంలో వైఫల్యం ఉంటే హెచ్‌ఎం తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే పరిశీలించి త్రిసభ్య కమిటీ మాత్రమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కమిటీకితప్ప ఇతరులెవరికీ వారిని తొలగించే అధికారం లేదన్నారు. డీఈవోను కలసిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, కార్మిక సంఘం నాయకులు లక్ష్మి, అంకమ్మ తదితరులు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల రవాణా కట్టడికి చర్యలు



అధికారులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్

భీమడోలు, జూన్ 20: మండలంలో కోళ్ల వ్యర్థాల రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, మత్స్య, పోలీస్ శాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. చేపల చెరువులకు నిషిద్ధ కోళ్ల వ్యర్థాలను మేతగా వాడితే ఆ చెరువులకు సంబంధించిన రైతులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యవర్థాలను తరలించే వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. లింగంపాడు, అంబర్‌పేట ప్రాంతాల్లో వ్యర్థాలను వినియోగిస్తున్న చెరువులను పరిశీలించారు. మత్స్యశాఖ అధికారి దుర్గాభవాని, తహసీల్దార్ వరహాలయ్య, ఎస్ఐ సుధాకర్, అటవీ శాఖ అధికారి శ్రీనివాస్‌బాబు, పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి కోసం చంద్రబాబు కృషి

ఏలూరు టూటౌన్, జూన్ 20: గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళితుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ అన్నారు. దళితుల కోసం 27 పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి చంద్రబాబు తోడ్పడ్డారని అన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి జగన్ పేరు పెట్టుకున్నారని విమర్శించారు. తిరిగి అంబేడ్కర్ పేరును పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.







అప్పనవీడులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న చింతమనేని, తాడువాయిలో విద్యార్థుల మానవహారం, పోలవరంలో పుస్తకాల పంపిణీ

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

పెదపాడు, జూన్ 20: విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అప్పనవీడు హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఆయన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉప్పలపాటి రాంప్రసాద్, మోరు శ్రావణి, వేమూరి శ్రీనివాసరావు, గుత్తా అనిల్, బొప్పన సుధా, వడ్డి వాసవి, గారపాటి రామసీత, మట్టా శ్రీను, పావులూరి రామారావు, దుద్దు జయరాం, ఎంఈవోలు, పాఠశాల సిబ్బంది, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

- పెదవేగి: విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలతోపాటు సొంత ఖర్చుతో నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే అందజేశారు. డీఈవో అబ్రహం, ఎంఈవోలు బుధవాస్, అరుణ్‌కుమార్, హెచ్‌ఎం పి.శైలజ, సర్పంచ్ భాస్కర దీక్షితులు, బొప్పన సుధాకర్ పాల్గొన్నారు.
- దెందులూరు: వ్యాయామ కళాశాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు క్యాంపు కార్యాయంలో గోపన్నపాలెం శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.నతానియేల్, విద్యార్థులు చింతమనేని ప్రభాకర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాయామ విద్యార్థులు క్రీడలు, వ్యాయామ విద్యలో ప్రతిభ కనబరచాలన్నారు.
- పోలవరం: ఎల్ఎన్‌డీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. గుబ్బా రాంబాబు, ఇళ్ల సత్యనారాయణ, తేలె నరసింహమూర్తి, చిక్కాల వెంకటేష్, దాసరి రవికుమార్, జక్కు సత్యనారాయణ, కట్టా నరేష్, జొన్నాడ గోపి, షేక బారిమా, కొల్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.
- లింగపాలెం: ధర్మాజిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్‌లను మోరంపూడి ప్రసాద్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ చదువుకుని, తన సొంత ఊరు, తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఏటా రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహకం ఇస్తానన్నారు. పాతూరి శ్రీనివాసరావు, కొత్తూరి నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- టి.నరసాపురం: విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలు వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ దారబోయిన లక్ష్మి జయవరపు శ్రీరామ్మూర్తి, అడపా నాగరాజు అన్నారు. మండలంలో 60 పాఠశాలల్లో 4133 మంది విద్యార్థులకు కిట్లు గురువారం పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి, హెచ్‌ఎం బీఎల్.స్వామి, ఆర్‌వీజీ.కృష్ణారావు, కె.కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు: ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత కోరారు. చేబ్రోలులోని పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ పడాల దుర్గా భవాని, ఎంపీటీసీలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ పాల్గొన్నారు. కైకరం హైస్కూలు ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో మొక్కలు నాటించారు. హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, ఉపాధ్యాయులు కూనాతి జాన్, కన్నారావు, గవరయ్య ఎకో క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం: తాడువాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రామాలయం వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించారు. హెచ్‌ఎం కె.దేవకరుణ మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వం అనేక పథకాలు, వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మరాజు, రహీమాబేగం తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు ప్రారంభించిన ఎస్పీ

కైకలూరు, జూన్ 20: కైకలూరులో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి గురువారం ప్రారంభించారు. ఇటీవల కైకలూరు పోలీసుల ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ సముదాయాల పక్కనే, జాతీయ రహదారిపై బంకు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమానికి వినియోగిస్తారన్నారు. సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం


పేదలకు ఆహారం అందజేస్తున్న జనసేన నాయకులు

కైకలూరు, జూన్ 20: దాతల సహకారంతో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచితంగా భోజనాన్ని అందజేస్తామని జనసేన నాయకులు తెలిపారు. రెండో రోజు గురువారం పార్టీ నాయకుడు పెరుగు నాగరాజు ఆర్థిక సహకారంతో పేదలకు ఉచితంగా భోజనాన్ని అన్న క్యాంటీన్ ద్వారా అందించారు. జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం చేయండి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కైకలూరు, జూన్ 20: ప్రకృతి వ్యవసాయం చేసేల రైతులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. వరహాపట్నంలో ఆయన స్వగృహం వద్ద నియోజకవర్గంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం కామినేనికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ మందులు వాడని పంటలు పండించేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శోభారాణి, గౌతమ్‌కుమార్, నాగ విజయ, అహోబలరావు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి విద్యాసాగర్

కలిదిండి, జూన్ 20 : స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ సబ్సిడీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు చల్లే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. 30 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, రైతు సంఘం ఉపాధ్యక్షులు సానబోయిన విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ వాకాని కోటేశ్వరరావు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతపత్రం ఇస్తున్న నాయకులు

ముసునూరు, జూన్ 20: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, హామీలేని పంట రుణాలను ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయకుంల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ ఎలిమికుమారికి రైతు సంఘం నాయకులు గురువారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులను సకాలంలో జారీచేసి, బ్యాంకుల్లో ఎటువంటి హామీలు లేకుండా పంటరుణాలను ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గత సీజన్‌లో ప్రకృతి వ్యవరీత్యాల వల్ల కౌలురైతులు ఆర్థికంగా నష్టపోయి, అప్పులపాలయ్యారని, దీనిని దృష్టిలో పెట్టుకుని గత ఏడాదిలో పంట రుణాలను రద్దు చేయాలని, పంటలకు మద్దత ధరలను చట్టపరంగా కల్పించాలని లక్ష్మణరావు కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మడుపల్లి వెంకట నాగేంద్రరావు, కోనేరు సురేష్ చంద్రబెనర్జీ, కూచిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, తూడు తొలగించండి

ముదినేపల్లి రూరల్, జూన్ 20: కాలువల్లో, డ్రైన్లలో మేటవేసిన గుర్రపుడెక్క, తూడు నిర్మూలించటానికి సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డీసీ మాజీ అధ్యక్షుడు సుదాబత్తుల వెంకటేశ్వరరావు కోరారు. గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వరిపొలాలు నీటిముంపునకు గురికాకుండా ముందస్తుగానే కాలువల్లో మేటవేసిన గుర్రపుడెక్క తూడును శాశ్వతంగా తొలగిస్తే రైతులు తమ పంటను ముంపుబారిన పడకుండా కాపాడుకుంటారని ఆయన పేర్కొన్నారు. అన్నవరం, పెదలంక, పెదకొమ్మిలేరు డ్రైన్‌లలో డెక్కతూడును తొలగించే పనులు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పూలరాజు డ్రైన్‌లోనూ దిగువున మేటవేసిన తూడు గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు.

పూడిక తొలగింపు

చాట్రాయి : పోలవరం గ్రామంలో తమ్మిలేరు రిజర్వాయర్ రైట్ మెయిన్ కెనాల్లో పూడిక ఎక్కువగా ఉండటం వల్ల నీరు సరిగ్గా రాక పోలవరం, చాట్రాయి, మర్లపాలెం గ్రామ రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా ప్రొక్లెయిన్‌తో పూడిక తొలగింపు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు, యర్రా హేమంత్‌కుమార్, యర్రా ప్రసాదరావు, పర్వతనేని సీతారామయ్య, గద్దల లక్ష్మణరావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ సత్యనారాయణ

కైకలూరు, జూన్ 20: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కొరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఎస్‌ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ నీటి ఎద్దడిపై అధికారులతో గురు వారం సమావేశం నిర్వహించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి ఎద్దడిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 25 గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి ఉందని ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. నదులలో నీరు లేనందున మరికొన్ని రోజుల పాటు గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌డ బ్ల్యూఎస్ డీఈ శాస్త్రీ, ఎంపీడీవోలు ఉమామహేశ్వర రావు, బేబి శ్రీలక్ష్మీ, జనతేజ్, మురళీ గంగాధరరావు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

సబ్జెక్టు టీచర్లు ఎక్కడ సారూ..

» అగమ్యగోచరంగా యూపీ పాఠశాలలు » స్కూల్ అసిస్టెంట్లు లేరు » పాఠ్యాంశాల బోధనా లేదు


దాకరం యూపీ పాఠశాల

ముదినేపల్లి, జూన్ 20 : మండల పరిషత్తు ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారయింది. తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చదివించాలా వద్దా అన్న సందిగ్ధం తల్లిదండ్రుల్లో ఏర్పడింది. యూపీ పాఠశాలల్లో మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఇంగ్లీష్, సైన్స్, లెక్కలు, సోషల్ బోధించే స్కూల్ అసిస్టెంట్లతోపాటు పండిట్లు కూడా లేకపోవడంతో విద్యార్థులకు ఆయా సబ్జెక్టులకు బోధన జరగడం లేదు. గత ప్రభుత్వం 117 జీవో ద్వారా యూపీ పాఠశాలల్లో మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు 92 మంది విద్యార్థుల లోపు ఉంటే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను రద్దు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ముదినేపల్లి మండలంలో 12 యూపీ పాఠశాలలు ఉండగా, ఒక్క పాఠశాలలో కూడా సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్లు లేరు. 117 జీవో ఫలితంగా ఏడాది క్రితం ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మండలంలోని యూపీ పాఠశాలల్లో రద్దయ్యాయి. దీంతో గత విద్యా సంవత్సరం నుంచి యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు పాఠశాలలకు రావడానికే పరిమితమయ్యారు. ఆ పాఠశాలల్లో ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్లు మాత్రమే ఉన్నారు. యూపీ స్కూళ్లలో ఎనిమిదో తరగతి నుంచి హైస్కూళ్లలో తొమ్మిదో తరగతిలో చేరిన విద్యార్థులకు ఏ సబ్జెక్టులపై అవగాహన లేకుండా పోయింది. ముదినేపల్లి మండలంలోని కొరగుంటపాలెం, చేవూరు, వైవాక, దాకరం, కోడూరు, చిన కామనపూడి, కాకరవాడ, బొబ్బిలిగూడెం, దేవపూడి, వాడవల్లి, వణుదుర్రు యూపీ పాఠశాలల్లో 80 నుంచి 90 మంది విద్యార్థులు ఉండడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రద్దయ్యాయి. వేరే పాఠశాలల నుంచి కూడా స్కూల్ అసిస్టెంట్లను మండలంలోని యూపీ పాఠశాలలకు డిప్యుటేషన్‌పై నియమించే అవకాశం కూడా లేకుండాపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మెగా డీఎస్సీకి నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రస్తుత విద్యా సంవత్సరానికి నియామకాలు జరిగే అవకాశం లేనందున వచ్చే విద్యాసంవత్సరం వరకు సబ్జెక్టు టీచర్లు రానట్లే.

అవగాహన రాహిత్యం



గత ప్రభుత్వం విద్యారంగంపై అవగాహన రాహిత్యంతో వ్యవహరించింది. ప్రాథమికోన్నత స్థాయిలో విద్యార్థులకు సబ్జెక్టు బోధించే టీచర్లు లేరు. దాకరం యూపీ పాఠశాలలో ఎనిమిది మంది టీచర్లు ఉండే వారు. జీవో నెంబర్ 117తో నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రద్దయ్యాయి. దీంతో విద్యార్థులకు బోధన కరువైంది.

- జాస్తి రాజా, సర్పంచ్, దాకరం

117 జీవో రద్దు చేయాలి



యూపీ పాఠశాలల్లో మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు 92 మందిలోపు విద్యార్థులుంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను రద్దు చేయాలని గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 117ను రద్దు చేయాలి. స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి. కొత్త డీఎస్సీ నియామకాలలోపు ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇస్తే యూపీ పాఠశాలల్లో సర్దుబాటు చేయవచ్చు.

- బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి

సంక్రాంతికి గృహప్రవేశాలు : మంత్రి పార్థసారథి

నూజివీడు, జూన్ 20: టిడ్కో ఇళ్ల కనీసం వెయ్యింటిని పూర్తిచేసి రానున్న సంక్రాంతికి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయిస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. పట్టణంలోని టిడ్కో ఇళ్ల గృహ సముదాయాన్ని గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇళ్లను నిర్మించిన ఎల్‌అండ్‌టీ సంస్థతో తాను సంప్రదింపులు జరిపానని, వారు ఈ నిర్మాణాలు పూర్తి చేయడానికి అంగీకరించారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. నూజివీడులో 2,800 గృహాలు 90 శాతం వరకు పూర్తి అయ్యాయన్నారు. లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకున్న ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిందని మంత్రి న్నారు. బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు మూడేళ్ల క్రితం రుణాలు చెల్లించాలంటూ నోటీసులు పంపారన్నారు. తమ పేరుతో ప్రభుత్వం తీసుకున్న రుణానికి తామెందుకు రుణాలు చెల్లించాలంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారన్నారు. లబ్ధిదారుల పేరుతో బ్యాంకర్ల నుంచి వైసీపీ ప్రభుత్వం ఎన్ని కోట్లు రుణం తీసుకుందో అనేది కొద్ది రోజుల్లో తేలుతుందన్నారు. టిడ్కో నిధులు దారి మళ్లించడంపై కేంద్ర ప్రభుత్వం గత ప్రభుత్వం పై అసహనం వ్యక్తం చేసి ఆ నిధులను వెంటనే ఆ సంస్థకు బదలాయించక పోతే ఏడు శాతం వడ్డీ వసూలు చేస్తామని స్పష్టం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వడ్డీ కింద రూ.27 కోట్లు జమ చేసిందన్నారు.


టిడ్కో ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

పీఏసీఎస్ నిర్మాణం పై విచారణ చేపట్టాలి

నూజివీడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవన నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని మంత్రి కొలుసు పార్థసారథికి జనసేన నాయకుడు ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ కోరారు. సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

పట్టణంలో మంత్రి పార్థసారధి తొలిసారి అధికారిక పర్యటన సందర్భంగా నూజివీడు ఆర్డీవో భవానిశంకర్ ఆయనకు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వివిధ శాఖల అధికారులు దుశ్శాలువాలతో సత్కరించారు. మంత్రి తొలుత నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులతో సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించారు.


ఎన్టీఆర్‌కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి

● నూజివీడు పట్టణంలో మంత్రి పార్థసారధి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 15వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీలోని మంచినీటి బోరు మరమ్మతులు చేయాలని, చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో డ్రైనేజీ పూడికతీత పనులను నిర్వహించాలని, ఎంప్లాయిస్ కాలనీలోని ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

● ఆగిరిపల్లి : మంత్రి పార్థసారధికి నూగొండపల్లి గ్రామ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంత్రి హోదాలో మొదటిసారిగా వచ్చిన సారధికి నిలువెత్తు పూలమాలతో స్వాగతం పలికారు. మొదట ఆగిరిపల్లి తెలుగుదేశం కార్యకర్త ఇటీవల మరణించిన బండారు శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


చీపురుగూడెంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది


ముసునూరులో కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ముసునూరు, జూన్ 20: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, ఎంపీపీ కొండా దుర్గా భవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ అన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు ప్రజాప్రతినిధులు గురువారం కిట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీలు తులిమెల్లి కృష్ణకుమారి, చీలి లక్ష్మీ, ఉప సర్పంచ్ తోట శ్రీను, టీడీపీ నాయకులు దేవినేని వరప్రసాద్‌రావు, చలసాని కుటుంబరావు, తుమ్మల లక్ష్మణరావు, తులిమెల్లి రంగరావు, హెచ్‌ఎం సుశీల, నాయకులు చలమాల మల్లేశ్వరరావు, బొల్లినేని బుజ్జియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అదిరోహించాలని నూజివీడు మండలం బత్తులవారిగూడెం గ్రామ సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ అన్నారు. బత్తులవారిగూడెం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ నూజివీడు మండల టీడీపీ అధ్యక్షులు ముసునూరి రాజా, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మండాడ తిరుపతిరావు, టీడీపీ నాయకులు బత్తుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● చాట్రాయి :మంగపేట, చీపురుగూడెం గ్రామాల్లో విద్యార్థులకు మండల టీడీపీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మీ, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో లోపాలను తెలుసుకుని వాటిని సరి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి


ఆగిరిపల్లిలో విశ్రాంత ఉద్యోగి పుల్లయ్యను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

ముసునూరు, జూన్ 20: రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలను అందించాలని తహసీల్దార్ జవహర్‌బాజి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ వీఆర్వో దేవసహాయంను తహసీల్దార్, సిబ్బంది దుశ్శాలువా పూలమాలలతో సన్మానించారు. డీటీ ఎమిలికుమారి, వీఆర్వోలు, రీసర్వే డీటీ జీపీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదవీ విరమణ చేసిన రెవెన్యూ అధికారులను సత్కరించారు. తహసీల్దార్ దశిక వంశీ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ నీటి తీరువాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్‌ఐ విజయలక్ష్మీ, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ నిష్పక్షపాతంగా సేవలందిస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ వీఆర్వోలు నరసింహారావు (వణుదుర్రు), హనుమంతరావు (పెనుమల్లి), సంజీవరావు (పేరూరు)ను తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరస కుమారి సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, మండల సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : స్థానిక మండల తహసీల్దార్ వారి కార్యాలయంలో ఆగిరిపల్లి ఇంచార్జి తహసీల్దార్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ డే నిర్వహించారు. రిటైర్డ్ గ్రామ పరిపాలన అధికారి కడార్ల పుల్లయ్య సన్మానించారు. సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో స్తంభించిన కార్యకలాపాలు

ముదినేపల్లి రూరల్, జూన్ 20 : నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నియమించిన త్రిసభ్య కమిటీల సభ్యులు రాజీనామాలు చేయడంతో పీఏసీఎస్‌లలో కార్యకలాపాలు స్తంభించాయి. దీంతో సొసైటీలలో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలంటే కార్యదర్శులకు పూర్తిస్థాయి అధికారం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు రుణాలకు సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కౌలు రైతులు సైతం పంట రుణాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంట రుణాలు ఎప్పుడు మంజూరు అవుతాయోనని ఆశతో ఎదురుచూస్తున్నారు. బొమ్మినంపాడు, బోకినంపాడు, చేవూరు, వైవాక, ఉప్పరగూడెం, దేవపూడి, వాడవల్లి, ముదినేపల్లి, వడాలి, చిగురుకోట, పెదపాలపర్రు, దాకరం, గురజ, పెనుమల్లి పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు రద్దు అయ్యాయి. ఆయా సొసైటీల పరిధిలో పంట రుణాలకు ఇప్పటికే దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఆయా సొసైటీలకు నూతన ప్రభుత్వం త్వరితగతిన ప్రత్యేక అధికారులను నియమిస్తే రుణాలు మంజూరు అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం సమాచారం

కానుకొల్లులో భూ వివాదం : ఒకరికి గాయాలు

మండవల్లి, జూన్ 20: కానుకొలులో గురువారం జరిగిన భూవివాదంలో గ్రామానికి చెందిన వల్లూరి శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడగా కైకలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వల్లూరు శ్రీనివాసరావు తనకున్న నాలుగు ఎకరాల భూమిలో విత్తనాలు చల్లుతుండగా ముదినేపల్లి మండలం దాకరం గ్రామానికి చెందిన వల్లూరుపల్లి శ్రీనివాసరావు, వంశీమోహన్, వేములపల్లి రాజేష్ వచ్చి భూమి తమదంటూ వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ తలెత్తింది. పొలంలో విత్తనాలు వేస్తున్న వల్లూరు శ్రీనివాసరావుపై వీరు దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విలేకరిపై కేసు

కలిదిండి, జూన్ 20 : రైతును డబ్బులు ఇవ్వాలని బెదిరించి తీసుకున్న ఓ విలేకరిపై (ఆంధ్రజ్యోతి) కాదు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపారు. మండలంలో సానారుద్రవరం గ్రామానికి చెందిన విన్నకోట రామకృష్ణ అనే రైతు గ్రామంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకున్నాడు. ఆ పొలంలో మెరక తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో కలిదిండికి చెందిన ఓ చిన్న పత్రిక విలేకరి శ్యామ్ సదరు రైతును రూ. ఎనిమిది వేలు ఇవ్వాలని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు రైతు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపారు.

వ్యవసాయ బోర్ల కేబుల్, సామగ్రి చోరీ

ముసునూరు, జూన్ 20: కొత్తపోడు తోటల్లో సుమారు 20 వ్యవసాయ బోర్లకు సంబంధించిన కేబుల్, స్టార్టర్‌ను బుధవారం రాత్రి దొంగిలించుకుపోయారు. అలాగే గత రెండు రోజుల్లో బైర్లు, రేవడి పొలాల్లో ఉన్న మరో 15 వ్యవసాయ బోర్లు సామగ్రి చోరీకి గురైంది. ఒక బోరు నుంచి సుమారు 15 నుంచి 20 మీటర్ల పొడవున ఉన్న కేబుల్ వైర్, స్టార్టర్‌లోని రాగి వైర్లు, ఫ్యూజుల్లో వేసిన రాగి వైర్లను దొంగిలించుకుపోతున్నారని, వీటి విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని రైతులు వాపోతున్నారు. గత నెలలో కూడా గోపవరం, పెద్దపాటివారిగూడెం, తాళ్లవల్లి, కాట్రేనిపాడు తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో బోర్లు సామగ్రి చోరీకి గురయ్యాయి. వీటిపై పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై ఫిర్యాదు

మండవల్లి, జూన్ 20: కానుకొల్లులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను అభినందిస్తూ జనసేన కార్యకర్తలు వేసిన ఫ్లెక్సీని కొందరు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో జనసేన కార్యకర్తలు కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కామినేని మండవల్లి పోలీసులకు ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనసేన కార్యకర్తలు వడ్లాని రామ్మోహన్, ఆకుల కుమార్‌రాజా, రాయగిరి రాము, తదితరులు గురువారం మండవల్లి ఎస్‌ఐ సీహెచ్ రామచంద్రాన్ని కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విచారణ చేపట్టారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి


మంత్రి సవితను కలిసిన నాయకులు

ముదినేపల్లి, జూన్ 20 : గ్రామీణ ప్రాంతాల్లో చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు, చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెదగొన్నూరు గ్రామ పద్మశాలీయుల సంఘ నాయకులు చేనేత శాఖ మంత్రి సవితను కోరారు. ఉండవల్లిలో మంత్రిని గురువారం సంఘ నాయకులు కలసి సత్కరించి తమ సమస్యలను వివరించారు. పద్మశాలీయుల సంఘం నాయకులు తిరివీధుల అమరబాబు, తుమ్మలచర్ల గణపతి మంత్రిని కలిశారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సవిత హామీ ఇచ్చారని సంఘ కార్యదర్శి సాయిబాబు తెలిపారు.

మంత్రి రవీంద్ర జన్మదిన వేడుకలు


మంత్రి రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న కైకలూరు టీడీపీ నేతలు

కలిదిండి, జూన్ 20 : మట్టగుంటలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు. టీడీపీ నాయకులు నాగిడి వీరబ్రహ్మం, అండ్రాజు దుర్గారావు, వడుగు గణపతి, నల్లమోతు వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి పరశురాముడు, కొప్పనాతి శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● కైకలూరు : మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర ఇంటికి పెద్దఎత్తున టీడీపీ నేతలు తరలివెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు గంగునేని వరప్రసాద్, తదితర నాయకులు తరలివెళ్లారు.

చాపరాల, సజ్జాకి జనసేన సత్కారం


చాపరాల దుర్గాప్రసాద్, బాబిలను సత్కరిస్తున్న నేతలు

మండవల్లి, జూన్ 20: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయానికి విశేష కృషి చేసిన కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా బాబిలను జనసేన నాయకులు భైరవపట్నం పార్టీ ఆఫీసు ఆధ్వర్యంలో గజ మాలతో గురువారం సత్కరించారు. జనసేన నాయకుడు వర్రే హనుమప్రసాద్, జనసేన మండవల్లి మండల అధ్యక్షులు బోయిన రాజేష్ ఆధ్వర్యంలో బాబిని గజమాలతో సత్కరించారు. కొల్లిబాబి, గుడివాడ గణేష్, వీరవల్లి శివయ్య, కూనపరెడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ మంత్రులకు అభినందనలు


కేంద్ర మంత్రి వర్మను అభినందిస్తున్న కృష్ణారావు

ముదినేపల్లి, జూన్ 20 : కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బీజేపీ ముదినేపల్లి మండల నాయకులు అభినందనలు తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగినబీజేపీ ప్రజా ప్రతినిధుల అభినందన కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు, శ్రీనివాస వర్మ, మంత్రి సత్యకుమార్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరితోపాటు ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలను కలసి బీజేపీ జిల్లా కార్యదర్శి కోట ప్రోలు కృష్ణారావు, ముదినేపల్లి మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి లక్ష్మీపతిరాజు, ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థికి బంగారు పతకం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నూజివీడు టౌన్, జూన్ 20: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. ఎస్‌ఆర్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1973-74) ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు సీహెచ్ రమ్య, షేక్ రియాజ్, ఎస్.దినేష్‌కు పతకాలను అందించగా, పాఠశాలకు విద్యుత్ సోలార్‌ను అందించారు. హెచ్‌ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

యోగా డే నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్ బాబు

కలిదిండి, జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈవో ప్రభాకర్ బాబు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కలిదిండిలో గురువారం మండల హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ స్టూడెంట్స్ కిట్స్ అందించాలన్నారు. గత సంవత్సరం పంపిణీ చేయగా, మిగిలి ఉన్న కిట్స్‌పై మాజీ సీఎం జగన్ ఫోటో పేరు ఉంటే వాటిని విద్యార్థులకు పంపిణీ చేయవద్దన్నారు. బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉచిత ఉపకరణాలకు వైద్య నిర్ధారణ శిబిరం

నూజివీడు టౌన్, జూన్ 20: ప్రత్యేక అవసరాలు కలిగిన బాల బాలికలకు ఉచిత ఉపకరణాలు అందించేందుకు వైద్యనిర్ధారణ శిబిరాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు డీవైఈవో సేవియ్యానాయక్ తెలిపారు. నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నతపాఠశాలలో 18 సంవత్సరాల్లోపు దివ్యాంగులకు వైద్య నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించటం జరుగుతోందని, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన దివ్యాంగ బాలబాలికలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చేవారు ఆధార్, రేషన్ కార్డు, సదరన్ సర్టిఫికెట్, రెండు ఫొటోలతో హాజరు కావాలని ఆయన సూచించారు.